సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 17 । మార్చి । 2024





డీఆర్ఎం తనిఖీలు

విశాఖ: వాల్తేర్ డివిజన్‌లో ఆధునికీకరించిన ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో శనివారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాభ్ తనిఖీలు నిర్వహించారు.



బాక్సింగ్ పోటీల్లో పతకాల పంట

ఉక్కునగరం: ఆలిండియా ఇంటర్ స్టీల్ బాక్సింగ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన క్రీడాకారులు చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
అనకాపల్లి	6.11	4.50
నర్సీపట్నం	6.14	4.48

- నోటిఫికేషన్ : ఏప్రిల్ 18వ తేదీ
- నామినేషన్ల స్వీకరణ : 18 నుంచి ఏప్రిల్ 25
- నామినేషన్ల పరిశీలన : ఏప్రిల్ 26 నుంచి
- నామినేషన్ల ఉపసంహరణ : ఏప్రిల్ 29
- పోలింగ్ : మే 13
- **ఓట్ల లెక్కింపు : జూన్ 4వ తేదీ**

సమరానికి సై

మొత్తం పోలింగ్ స్టేషన్లు	మొత్తం ఓటర్లు	సమస్యాత్మక కేంద్రాలు
1,529	12,78,625	332

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల నగరా మోగింది. పార్లమెంట్‌తో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఏడు విడతల్లో ఎన్నికలు జరగనుండగా ఈసారి నాలుగో విడతలో ఏపీలో పార్లమెంటు స్థానాలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి శనివారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేశారు. ఒక పార్లమెంట్ స్థానంతో పాటు 6 నియోజకవర్గాలకు ఎన్నికల నగరా మోగింది. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ..కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, జిల్లాలో 6 నియోజకవర్గాలతో పాటు పెందుర్తి నియోజకవర్గం లోని సబ్బవరం, పరవాడ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధ



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, చిత్రంలో ఎస్పీ మురళీకృష్ణ

నల మేరకే వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు వ్యవహరించాలని, ఓటర్లను ప్రలోభపెట్టిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. డీఆర్వో దయానిధి, ఎడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, ఎంసీ నోడల్ అధికారి లక్ష్మి పాల్గొన్నారు.

మార్చి 16 నాటికి ఓటర్ల జాబితా

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	థర్డ్	మొత్తం
చోడవరం	1,04,589	1,10,800	6	2,15,395
మాడుగుల	91,486	96,267	1	1,87,754
అనకాపల్లి	1,02,108	1,09,635	5	2,11,748
పెందుర్తి	1,50,257	1,52,454	5	3,02,716
యలమంచిలి	99,760	1,05,351	9	2,05,120
పాయకరావుపేట	1,22,402	1,26,298	2	2,48,702
నర్సీపట్నం	1,01,650	1,08,105	4	2,09,759

- ఎన్నికల సిబ్బంది 10,000
- 1950 కాల్ సెంటర్ - 2
- మీడియా మానిటరింగ్ టీంలు - 6
- ఎక్స్‌పెండిచర్ టీంలు - 5
- కంప్లయింట్ మానిటరింగ్ టీంలు - 7
- సోషల్ మీడియా టీంలు - 3

సువిధ యాప్ ద్వారానే అనుమతులు

ఎన్నికలు పకడ్బందీగా.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. రాజకీయ పార్టీలు ప్రచారానికి, సభలకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇస్తాం. రాజకీయ నాయకుల వద్ద ఏవైనా ఆయుధాలు ఉంటే డిపాజిట్ చేయాలి. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో, కొన్ని కీలక కూడళ్లలో 24 చెక్ పోస్టులను ఏర్పాటుచేశాం. మొత్తం 158 సెక్టార్లుగా విభజించి పోలీసు అధికారులను కేటాయించాం. అక్రమంగా మద్యం రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాలతో నిఘా, ప్రత్యేక సాయుధ బలగాలతో పహారాకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నల్లధనం, అక్రమ మద్యం అరికట్టడానికి చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాం. పాత రౌడీ షీటర్లను, గొడవలు, తగాదాలు సృష్టించేవారిని ముందుగా గుర్తించి, బైండోవర్ కేసులు నమోదు చేస్తాం

– కె.వి. మురళీకృష్ణ, ఎస్పీ

సామాజిక సమతూకం

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతూకం పాటించారు. మెజార్టీ సామాజిక వర్గాలైన బీసీలకు అగ్రపీఠం వేశారు. ఐదుగురు బీసీలు (ముగ్గురు కొప్పుల వెలమ, ఇద్దరు తూర్పు కాపు), ఒక ఎస్సీ, ఒక ఓసీ క్షత్రియకు అవకాశం కల్పించారు. అనకాపల్లి నుంచి తొలిసారి తూర్పుకాపునకు చెందిన మలసాల భరత్‌కుమార్ ఎన్నికల బరిలో నిలవనున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు, విద్యావంతుడైన మలసాల భరత్‌కు అవకాశం కల్పించడంతో యువత నుంచి హర్షం వ్యక్తమవుతోంది. చోడవరం నియోజకవర్గం నుంచి రెండోసారి కరణం ధర్మశ్రీకి అవకాశం కల్పించారు. పాయకరావుపేట నుంచి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కంబాల జోగులుకు అవకాశం దక్కింది. జోగులు విజయనగరం జిల్లా రాజాం నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కొప్పుల వెలమకు చెందిన ముగ్గురికి టికెట్లు దక్కాయి. మాడుగుల నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు గెలిచి డిప్యూటీ సీఎంగా పనిచేసిన బూడి ముత్యాలనాయుడుకు మూడోసారి అవకాశం కల్పించారు. నర్సీపట్నం, పెందుర్తి నియోజకవర్గాల నుంచి సిటింగ్ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్‌రాజ్‌లకు టికెట్ దక్కింది. యలమంచిలి నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు (కన్నబాబురాజు)కు మరోసారి అవకాశం కల్పించారు.

స్వయంభూ విఘ్నేశ్వరుని సేవలో మంత్రి, ప్రభుత్వ విప్



విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరస్వామి వారిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం దర్శించుకున్నారు. వీరిద్దరికీ పార్టీ అధిష్టానం గాజువాక, చోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా టికెట్లు కేటాయించడంతో వీరు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి అమర్‌నాథ్ సతీసమేతంగా స్వామి వారిని దర్శించుకోవడమే గాకుండా 108 ప్రదక్షిణలు చేసి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలు పూర్తయ్యే వరకు 'స్పందన' రద్దు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కోడ్ అమలులోకి వచ్చినందున ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుందన్నారు. అప్పటి వరకు ప్రజలు అర్జీలు, ఫిర్యాదులు కలెక్టర్ కార్యాలయానికి తీసుకురావద్దని సూచించారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు

సీతంపేట (విశాఖ): ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో జరిగిన ముగింపు సభలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ గ్లకోమాపై అవగాహన కల్పించడం వైద్య ఉద్యోగులుగా మనందరి బాధ్యతని పేర్కొన్నారు. వారం రోజులపాటు గ్లకోమా అవగాహన కార్యక్రమాలు ఎక్కడెక్కడ ఎలా జరిగాయో వివరించారు. జూనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులకు గ్లకోమాపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

త్యాగమూర్తి.. పొట్టి శ్రీరాములు



అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, పోలీసు అధికారులు

తుమ్మపాల: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి మరువలేదని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారని చెప్పారు. మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాల ద్వారా వారి జీవిత విశేషాలు తెలుసుకుని, స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో దయానిధి, జిల్లా బీసీ వెల్ఫేర్ డీడీ కె.రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, డీటీవో కె.వి.ప్రకాష్‌రావు, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, పైడపునాయుడు పాల్గొన్నారు.



మాకవరపాలెంలో కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న నాయకులు



దేవరాపల్లిలో ఆనందం పంచుకుంటున్న కిలపర్తి, కర్రి సత్యం



బుచ్చెయ్యపేటలో ధర్మశ్రీకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఫుల్ జోష్

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటనతో మిన్నంటిన సంబరాలు
- స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్న పార్టీ శ్రేణులు

సాక్షి, అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు (పెందుర్తి సహా) అభ్యర్థులను ప్రకటించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నెలకొంది. మాడుగుల, చోడవరం, యలమంచిలి, నర్సీపట్నం, పెందుర్తి నియోజకవర్గాలకు సిటింగ్ ఎమ్మెల్యేలైన బూడి ముత్యాలనాయుడు, కరణం ధర్మశ్రీ, కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అదీప్‌రాజులకు టికెట్లు దక్కాయి. ఇక పాయకరావుపేటలో ప్రస్తుత ఎమ్మెల్యే బాబూరావును రాజ్యసభకు పంపడంతో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుకు టికెట్ ఇచ్చారు. అనకాపల్లిలో రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఉన్నత విద్యాధికుడు మలసాల భరత్ కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. అభ్యర్థులకు అభినందనలు వెల్లువెత్తాయి. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని సందడి చేశారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



బూడి ముత్యాల నాయుడు
మాడుగుల

విద్యార్హత : బీఏ, బీఈడీ, బీఎల్
రాజకీయ అనుభవం : వార్డు సభ్యుడిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులను చేపట్టారు. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు.

అర్హతే కొలమానంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేయడంతో మళ్లీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పథకాలు అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అందించిన సేవలను గుర్తించి నాపై అపారమైన నమ్మకంతో మూడోసారి టికెట్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు.

ఆశీర్వదించండి



కంబాల జోగులు
పాయకరావుపేట

విద్యార్హత: బీఏ బీఎల్
రాజకీయ అనుభవం : 2004లో టీడీపీ తరఫున పాలకొండ ఎమ్మెల్యేగా తొలిసారి ఎన్నిక. 2014, 2019 ఎన్నికల్లో రాజాం ఎమ్మెల్యేగా విజయం.

వైఎస్సార్‌సీపీ చేపట్టిన సంక్షేమపథకాలే తన విజయానికి దోహదపడతాయి. జగనన్న నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. రాజాం శాసనసభ్యుడిగా వైఎస్సార్‌సీపీ తరఫున రెండుసార్లు గెలిచాను. వందలాది కోట్ల రూపాయలతో శాశ్వతమైన అభివృద్ధి పనులు చేపట్టాను. నియోజకవర్గం మీద అవగాహన వచ్చింది. ఇక్కడ కూడా సేవలందించే విధంగా ఆశీర్వదించమని ప్రజలను కోరుతున్నాను.

సామాజిక న్యాయం



కరణం ధర్మశ్రీ
చోడవరం

విద్యార్హత: బీఏ, బీఈడీ, బీఎల్
రాజకీయ అనుభవం : 2004లో వైఎస్సార్ ఆశీస్సులతో మాడుగుల ఎమ్మెల్యేగా పోటీ చేసి మొదటిసారే గెలుపొందారు. 2009, 2014 ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2019లో 29 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో 50 శాతం సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వెనుకబడిన కులాలకు కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. దేశ చరిత్రలో ఒక ప్రాంతీయ పార్టీ ఇన్ని సీట్లు ఇచ్చింది ఎప్పుడూ లేదు. టీడీపీ బీసీలను వాడుకొని వదిలేసింది. భవిష్యత్‌లో వెనుకబడిన కులాలకు మరింత సామాజిక న్యాయం జరగాలంటే అది వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం.

స్థానికుడిని.. ఆశీర్వదించండి



మలసాల భరత్‌కుమార్
అనకాపల్లి

విద్యార్హత: బీటెక్, ఎంబీఏ,
రాజకీయ అనుభవం : భరత్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. తండ్రి రమణారావు సర్పంచ్‌గా రెండుసార్లు ఎన్నికయ్యారు. ఆర్ఈసీఎస్ చైర్మన్‌గా పనిచేశారు. తల్లి మలసాల కాసులమ్మ రెండుసార్లు జెడ్పీటీసీగా, ఒకసారి ఎంపీపీగా ఎన్నికయ్యారు

అనకాపల్లి ఎమ్మెల్యేగా ఎక్కువగా బయటి ప్రాంతాల వారే గెలుపొందారు. కశింకోట మండలానికి చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చాను. స్థానికుడనైన నన్ను ఆశీర్వదించవలసిందిగా కోరుతున్నాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నిజం చేస్తా. ప్రతీ కుటుంబానికి ఉపాధి కల్పించే లక్ష్యంతో పనిచేస్తాను. నియోజకవర్గంలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీని ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తా.

జగన్ ఆశయ సాధనకు..



యు.వి. రమణ మూర్తిరాజు
యలమంచిలి

విద్యార్హత: బీకామ్
రాజకీయ అనుభవం : యలమంచిలి శాసన సభ్యుడిగా మూడుసార్లు గెలిచారు. ముక్కుసూటి మనిషిగా పేరుపొందారు. అచ్యుతాపురం ఎస్ఈజడ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశీస్సులతో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచాను. అలా మూడుసార్లు సేవ చేసే అదృష్టం దక్కింది. ముఖ్యమంత్రి జగన్ నాకు రెండోసారి అవకాశం ఇచ్చారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పేదల మేలు కోసం కృషి చేస్తాను. సంక్షేమ పథకాల అమలులో మా నియోజకవర్గంలో పూర్తి పారదర్శకత ఉంది. రాష్ట్ర అభ్యున్నతికి జగన్ నాయకత్వం ఎంతైనా అవసరం.

ప్రతి కుటుంబానికి మేలు



ఉమాశంకర్ గణేష్
నర్సీపట్నం

విద్యార్హత: బీఏ
రాజకీయ అనుభవం : వైఎస్సార్‌సీపీ తరఫున 2014లో పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. 2019లో మంచి మెజారిటీతో గెలిచారు.

పార్టీ స్థాపించిన నాటి నుంచి జగనన్న నాకు సముచిత స్థానం కల్పించారు. ఇప్పుడు మరోసారి అవకాశం ఇచ్చారు. ప్రజల ఆశీస్సులతో విజయ ఢంకా మోగిస్తా. ఐదేళ్లలో సీఎం ప్రవేశ పెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేకూరింది. రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల, కోట్లాది రూపాయలతో రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

నగదు, మద్యం పంపిణీపై నిఘా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం, ఉచిత కానుకలు పంపిణీ చేసేందుకు అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులను ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, డీటీవో కె.వి.ప్రకాష రావు, ఎస్ఈబీ జయసింహ చౌదరి, ఆర్‌పీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అజయ్‌నాందేవ్ సంసారి, సెబ్ ఏఈఎస్ డి.శైలజరాణి, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ట్రా'ఫికర్' లేకుండా చూడండి

తుమ్మపాల: పరీక్షలకు హాజరయ్యే టెన్త్ విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 30 వరకు జరగనున్న పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఇప్పటికే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పోలీసులకు ఈమేరకు ఆదేశాలు జారీ చేసినట్టు ఆయన తెలిపారు. తల్లిదండ్రులతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలలో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళుతున్న సమయంలో కేసులు బుక్ చేయడం, ఆకస్మికంగా వాహనాల ఆపడం తదితర చర్యలు చేపట్టవద్దని సూచించారు. జిల్లాలో పోలీసులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సీతారాం సూచించారు.

పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీగా సోమేశ్వరరావు



యలమంచిలి రూరల్: స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీగా సీహెచ్ సోమేశ్వరరావు ఎన్నికయ్యారు. యలమంచిలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 20 ఏళ్ల నుంచి సోమేశ్వరరావు పనిచేస్తున్నారు. గుంటూరులో గురువారం రాత్రి జరిగిన రాష్ట్ర మహాసభలో సీహెచ్ సోమేశ్వరరావును రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చిత్తశుద్ధితో పనిచేస్తానని చెప్పారు. యలమంచిలి పట్టణానికి చెందిన పెన్షనర్ల సంఘ ప్రతినిధులు ఆయన్ని అభినందించారు.

సంక్షేమాభివృద్ధికి చిరునామాగా పల్లెలు



కొత్తపెంటలో సంక్షేమాభివృద్ధి వివరాలతో కూడిన పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



వాకపల్లిలో ఇంటింటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

- కొత్తపెంటలో రూ.17.92 కోట్లతో సంక్షేమాభివృద్ధి
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- కొత్తపెంటలో రూ. 68 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం
- ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమాభివృద్ధి ఫైలాన్ ఆవిష్కరణ
- వాకపల్లిలో రూ.1.20 కోట్లతో ఇంటింటా కుళాయిలు ప్రారంభం

దేవరాపల్లి : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లె గ్రామాలు సంక్షేమాభివృద్ధికి చిరునామాగా మారాయని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు కొత్తపెంట, వాకపల్లి గ్రామాల్లో రూ.1.88 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను పండగ వాతావరణంలో శనివారం ఉదయం ఆయన ప్రారంభోత్సవం చేశారు. కొత్తపెంటలో డిప్యూటీ సీఎం బూడికి అధిక సంఖ్యలో హాజరైన ప్రజలు మహిళల కోలాట ప్రదర్శన నడుమ ఘన స్వాగతం పలికారు. ముందుగా దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొత్తపెంట చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో రూ. 17.92 కోట్లతో చేపట్టిన సంక్షేమాభివృద్ధి వివరాలతో కూడిన పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. కొత్తపెంట శివారు కొత్తూరులో రూ.39 లక్షలతో ఇంటింటి కుళాయిలను, రూ. 20 లక్షలతో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, రూ. 4 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైనేజీలను, రూ. 5లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని మొత్తంగా రూ.68 లక్షలతో చేపట్టిన నాలుగు అభివృద్ధి పనులను శిలాఫలకాలు ఆవిష్కరించి ప్రారంభోత్సవం చేశారు. వాకపల్లిలో రూ. 1.20 కోట్లతో చేపట్టిన ఇంటింటా కుళాయిలను ఆయన ప్రారంభించారు. కొత్తపెంట చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అత్యధికంగా రూ.17.92 కోట్లతో సంక్షేమాభివృద్ధి పనులు చేపట్టిన ఘనత తమకే దక్కిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, కొత్తపెంట, వాకపల్లి సర్పంచ్‌లు వెంకటరావు, బుగత రాజేశ్వరి, ఎంపీటీసీలు మజ్జి దేవిరాజు, భాస్కరరావు, మాజీ సర్పంచ్ రెడ్డి పైడంనాయుడు, రొంగలి శంకరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రెడ్డి అప్పారావు, కలిగొట్ల పీఏసీఎస్ అధ్యక్షుడు చింతు రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల బ్యానర్లు తక్షణం తొలగించాలి

అనకాపల్లి : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున తక్షణమే పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, బ్యానర్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, అనకాపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాహ్నవి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఆదేశించారు. రాజకీయ నేతల విగ్రహాలపై ముసుగులు వేసి కప్పి వేయాలన్నారు. పోస్టర్లు, గోడలపై రాతలు, రాజకీయ ప్రకటనలు, బ్యానర్లు, పోస్టర్లు తొలగించాలన్నారు.

టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు

అనకాపల్లి : ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు చర్యలు చేపట్టినట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 108 సెంటర్లలో 21,259 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. బాలురు 10,873, బాలికలు 10,386, ప్రైవేట్ విద్యార్థులు 2,324 మంది ఉన్నారు. విద్యార్థులు 8.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలన్నారు.

ప్రైవేటు టీచర్‌పై లైంగిక వేధింపులు

యలమంచిలి రూరల్ : ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న 30 ఏళ్ల వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై యలమంచిలి రూరల్ పోలీసులు శనివారం సాయంత్రం కేసు నమోదు చేశారు.కశింకోట మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన బొద్దపు ప్రసాద్ అలియాస్ భాస్కర్ అనే వ్యక్తి కొంత కాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. శనివారం యలమంచిలి రైల్వే గేటుకు సమీపంలో బాధితురాలితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పైల సింహాచలం తెలిపారు.

లోక్ అదాలత్ తీర్పునకు తిరుగులేదు



సదస్సులో మాట్లాడుతున్న సబ్‌జడ్జి అరుణశ్రీ

చోడవరం రూరల్ : లోక్ అదాలత్‌లో ఇరువర్గాల సమ్మతి మేరకు ఇచ్చే తీర్పే తుది తీర్పని, దానిపై అప్పీలు చేసుకోవడానికి వీలులేదని లోక్ అదాలత్ తీర్పే అంతిమమని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవా ప్రాధికార సంస్థ చైర్‌పర్సన్ సత్తి అరుణశ్రీ స్పష్టం చేశారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో న్యాయవిజ్ఞాన సదస్సు అనంతరం లోక్ అదాలత్‌లను నిర్వహించారు. సదస్సులో సబ్ జడ్జి అరుణశ్రీ పలువురు కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి కాలాన్ని, సమయాన్ని వృధా చేసుకునే కన్నా న్యాయశాఖ కల్పించిన లోక్ అదాలత్ అనే చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇరువర్గాలు చక్కని పరిష్కారంతో తీర్పు పొందడం మేలని అన్నారు. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ శేఖరం, సీనియర్ న్యాయవాదులు ఆర్.ఎస్.పి నాయుడు, భూషణం పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 88 కేసులు పరిష్కారం

కోర్టుల సముదాయంలో సబ్ జడ్జి సత్తి అరుణశ్రీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 88 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో క్రిమినల్ కేసులు 69 కాగా సివిల్ వ్యాజ్యాలు 19 పరిష్కరింపబడ్డాయి. ఇరు వర్గాల కక్షిదారులు వారి వారి న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ పీహెచ్‌ఈటీ సెంటర్‌కు పురస్కారం



అవార్డు పత్రాన్ని అందుకుంటున్న జగన్నాథరావు



ప్రశంసాపత్రం



షీల్డ్

అనకాపల్లి: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్ఏఆర్ఎస్)కు పురస్కారం లభించింది. భారత వ్యవసాయ పరిశోధనా మండలి, జాతీయ పంటకోత అనంతరం ఇంజినీరింగ్ సాంకేతిక సంస్థ లూథియానా వారు 2023–24 సంవత్సరానికి జాతీయ స్థాయిలో ఆర్ఏఆర్ఎస్‌కు పీహెచ్‌ఈటీ సెంటర్‌కు మూడో ఉత్తమ కేంద్రంగా పురస్కారం ఇచ్చారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో ఇక్కడ పంటకోత సాంకేతిక పరిజ్ఞాన పథకం ద్వారా విశిష్టమైన పరిశోధనలు నిర్వహించి గతంలో పరిశోధనా స్థానం మూడు పేటెంట్ల సాధించుకుంది. ఇటీవల చేసిన పరిశోధనల్లో భాగంగా వరిలో ఇనుము, ఫోలిక్‌యాసిడ్ సమ్మేళితం చేసి ఇనుము లోపంతో ఏర్పడే రక్తహీనతను నివారించే పరిజ్ఞానం, చెరకు రసాన్ని బహుముఖంగా వినియోగించే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి మరో పేటెంట్ కోసం పై రెండు టెక్నాలజీలను దరఖాస్తు చేశారు. ఇటీవల రూ.3.73 కోట్లతో ప్రారంభమైన కామన్ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా చెరకు, చిరుధాన్యాలు, పనస శుద్ధి చేసి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తారు. ఈ కేంద్రం ద్వారా ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు ఆధ్వర్యంలో అగ్రో ప్రాసెసింగ్ సెంటర్‌లో ఇద్దరు ఔత్సాహిక బెల్లం ఉత్పత్తుల తయారీదార్లు, 5 సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేసి వ్యాపారాలకు అందజేశారు.

'ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి'

నాతవరం : రాజ్యాంగంలో కల్పించిన హక్కులను సాధించాలంటే ఐక్యతగా ఉద్యమిస్తేనే సాధ్యపడుతుందని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు అన్నారు. తాండవ జంక్షన్‌లో రెల్లి కులస్తుల సమస్యలపై చర్చించేందుకు శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే రెల్లి కులస్తులు అభివృద్ధి చెందుతారన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

నేడు భావనారాయణ స్వామి కల్యాణోత్సవం

అనకాపల్లి: స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం భద్రావతి సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపాన సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యులు, భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

సీసీరోడ్లు, డ్రైనేజీలకు రూ.12 కోట్లు విడుదల


జగనన్న లే అవుట్‌లో సీసీరోడ్డు, డ్రైనేజీకి శంకుస్థాపన చేస్తున్న ఈఈ జేసీపీ సింగ్

అనకాపల్లి: జగనన్న లేఅవుట్లలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 కోట్లు విడుదల చేసిందని వీఎంఆర్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.సి.పి.సింగ్ తెలిపారు. మండలంలో సంపతిపురం, వేటజంగాలపాలెం, కుంచంగి గ్రామాలతోపాటు మరో నాలుగు ప్రాంతాల్లోని లేఅవుట్లలో శనివారం ఉదయం శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో మౌలిక సదుపాయల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రెండు మూడు నెలల్లో డ్రైనేజీలు, సీసీరోడ్ల పనులు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. అనకాపల్లి జోన్ 81వ వార్డు పరిధిలోని రావుగోపాలరావు కళాక్షేత్రంలో మౌలికసదుపాయాలకు రూ.50లక్షల ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, శంకుస్థాన పనులు చేశామని, రెండు మాసాల్లో పనులు పూర్తవుతాయని ఆయన చెప్పారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన


రైతులు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

అనకాపల్లి: పొద్దు తిరుగుడు, నువ్వు పంటల్లో సస్యరక్షణ చర్యలపై శనివారం రైతులతోపాటు అగ్రికల్చర్ విద్యార్థినులకు తుమ్మపాల గ్రామంలో వ్యవసాయశాఖ డివిజన్ ఆత్మ ఏటీఎం రామకృష్ణ అవగాహన కల్పించారు. పొద్దుతిరుగుడు పంటకు ఎక్కువగా శనగపచ్చ పురుగు, నువ్వు పంటకు ఆకుముడత, కాయతొలచు పురుగు ఆశిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థినులు భార్గవి ,చరిష్మా, రైతులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 5,584 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,690	4,600
మొదటి రకం	3,550	4,320
రెండో రకం	3,420	3,790
మూడో రకం	3,240	3,470

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
షరతులు వర్తిస్తాయి (మూడు ఆటలు)	
లంబసింగి (మధ్యాహ్నం)	: షిర్డిసాయి
రజాకర్	: పర్తిసాయి
వెయ్‌దరువెయ్	: వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-10 యూనిట్లు, బి పాజిటివ్-35 యూనిట్లు, ఒ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 461 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 373 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి


స్మార్ట్ స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తున్న మలసాల భరత్‌కుమార్


కశింకోటలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసి, పారదర్శకంగా ప్రజలకు అందించారన్నారు. మరోవైపు రాష్ట్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ గ్రామాలు కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందాయని చెప్పారు. ఈ విషయాలను ప్రజలకు వివరిస్తూ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. తద్వారా పార్టీ విజయానికి దోహదపడాలన్నారు. పని చేసే కార్యకర్తకు గుర్తింపు ఉంటుంద తెలిపారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో నాయకులు సత్కరించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

విద్య,వైద్య రంగాలకు పెద్ద పీట

అనకాపల్లి: రాష్ట్రంలో విద్య,వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక వేల్పులవీధి బాలాజీ రావుపేటలో రూ.3.4 కోట్లతో నిర్మించిన స్మార్ట్ స్కూల్ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేద విద్యార్థులకు సీఎం నాణ్యత గల విద్యను అందిస్తున్నారని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

పొత్తులతో కొన్ని పార్టీలు గుంపులుగా వస్తున్నాయని, వాటిని నమ్మవద్దని సూచించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి


అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముకుందరావు, శాస్త్రవేత్తలు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాగభూషణం


పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

అనకాపల్లి: స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, ఎం.విశాలాక్ష్మి, సీహెచ్. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

భారత రత్న ప్రకటించాలి

అమరజీవి పొట్టి శ్రీరాములకు భారతరత్న ప్రకటించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులో అమరజీవి విగ్రహం వద్ద జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 52 అడుగుల విగ్రహాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు అమరజీవికి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, కార్యదర్శి వినకోట నీలేశ్‌గుప్తా, సహాయ కార్యదర్శులు రొబ్బి మల్లేశ్వర రావు, బల్లా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, కొత్తూర్తి రామారావు, బూడిద జోగారావు, పెదిరెడ్ల సుజాత, పిరాట్ల నరసింహమూర్తి, ఆర్యవైశ్యసంఘ సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి పొట్టి శ్రీరాములు పార్కులో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌కు క్లబ్ తరఫున రెండు ఫ్యాన్లు వితరణగా అందజేశారు. బాలికల హైస్కూల్లో 25 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి, మొక్కలు నాటారు. స్థానిక దుర్గమాంబ ముఖద్వారం సమీపంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ కె.పి.వి.ఎస్. రామలింగస్వామి, జిల్లా గవర్నర్ వరహాలరావు, క్లబ్ అధ్యక్షుడు జె.నూకరాజు, కార్యదర్శి డి.వి.కె. గుప్తా, కోశాధికారి కె.సతీష్, క్లబ్ ప్రతినిధి పాలూరి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పాటుపడాలి


మునగపాకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ


మునగపాక వినాయకుని ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తి రాజును గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. మునగపాకలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ముందుగా సంతబయిల వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల కాలంలో ఎమ్మెల్యే రమణ మూర్తిరాజు హయాంలో మునగపాక మండలం అభివృద్ధి చెందిందన్నారు. ఎన్నికల హామీల అమలు ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, సచివాలయ మండల కన్వీనర్ పాలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆడారి కాశీబాబు, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, ఇంటి శ్రీనివాసరావు, ఆడారి సంతోష్ కుమార్, టెక్కలి గంగునాయుడు పాల్గొన్నారు.

వజ్ర కవచాలంకృత గోవిందా



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామిని ప్రత్యేకంగా వజ్ర కవచం, పలు రకాల పూల మాలలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామ చరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

వైఎస్సార్‌సీపీని గెలిపించాలి


గోకివాడలో పార్టీ నాయకులతో సమావేశమైన సూర్యనారాయణ

రాంబిల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని యలమంచిలి నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎస్.వి.సూర్యనారాయణ అన్నారు. గోకివాడ గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కన్నబాబురాజును భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. జగనన్న సంక్షేమం, అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి సూరిబాబు, ద్వారపురెడ్డి గోవిందరావు, నందవరపు రాఘవ, పందుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కచ్చితంగా ఎన్నికల నియమావళిని పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పలస్వామి, ఎంపీడీవో వెంకటాచలం

రాంబిల్లి : ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని తహసీల్దార్ బి. అప్పలస్వామి, ఎంపీడీవో వెంకటాచలం ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, వీఆర్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల నియమావళిపై తహసీల్దార్, ఎంపీడీవో పలు సూచనలు చేశారు. ప్రవర్తన నియమావళిని పాటించని వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆన్‌లైన్ మోసాలపై 1930కి ఫిర్యాదు చేయండి


ఆన్‌లైన్ మోసాలపై గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

చోడవరం రూరల్: ఆన్‌లైన్ మోసానికి గురైనట్టయితే 1930 నంబర్‌కు కాల్ చేయాలని ఎస్ఐ ఎస్. సూర్యనారాయణ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్ కమిటీ, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్లో కనిపించే ప్రతి మెసేజ్‌పై క్లిక్ చేయడం, మరొకరికి ఫార్వర్డ్ చేయడం తదనంతర తీవ్ర పరిణామాలను ఎదుర్కొనే పరిసిత్థులను ఆయన వివరించారు. ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియా క్రేజ్‌లో పడి తమ భవిష్యత్తుకు ముప్పు తెచ్చుకోవద్దన్నారు. విద్యార్థులు తమ ఫోన్ నంబర్లను తెలిసినవారికి మాత్రమే ఇవ్వాలని శిరీష సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, డాక్టర్ రత్నభారతి, బి.పిచ్చమ్మ ఆన్‌లైన్లు మోసాలు చోటుచేసుకునే తీరుతెన్నులను వివరించారు. తొలుత గోడపత్రికలను ఆవిష్కరించారు. సీనియర్ ఉపన్యాసకులు ఎస్.ఎం.రఫీయుద్దీన్, లక్ష్మీమంగమ్మ, ఐ.వి.వి.సత్యవతి, జి.నారాయణమూర్తి, హెచ్.జ్యోతి పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

దేవరాపల్లి: కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతికి చెందిన 50 మంది విద్యార్థులకు దాతలు సమకూర్చిన పరీక్ష సామగ్రిని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యుడు కె.వి.రమణ పంపిణీ చేశారు. హెచ్ఎం పి.బి.టి. సుందరి సమక్షంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీనుతో కలిసి వీటిని అందజేశారు.

ఆలిండియా ఆర్ట్ పోటీల్లో పతకాల పంట


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం వరప్రసాద్, ఉపాధ్యాయులు

రోలుగుంట: డ్రీమ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ పోటీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిలో ముగ్గురికి స్వర్ణం, ఇద్దరికి సిల్వర్ పతకాలు లభించాయి. హెచ్ఎం డి.ఎస్.ఎస్. వరప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 2న డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ విజయవాడ, కె.ఎల్ యూనివర్సిటీ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 11వ ఆలిండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. శనివారం వీరిని హెచ్ఎం, తదితరులు అభినందించారు.

ఘనంగా గౌరమ్మ సంబరం


వెదురుపర్తిలో గౌరమ్మను దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్


ఉత్సవంలో మహిళల కోలాటం

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో శనివారం రాత్రి గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు గౌరమ్మను దర్శించుకుని, పూజలు చేశారు. అనకాపల్లి అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మలసాల భరత్‌కుమార్ గౌరమ్మను దర్శించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువా, జ్ఞాపికతో ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం


గొబ్బూరులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నివేదిత

కశింకోట: రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ కృషి చేయాలి వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత కోరారు.

మండలంలోని గొబ్బూరులో శనివారం ఆమె ఉపాధి పథకం కూలీలతో సమావేశమయ్యారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి, అనకాపల్లి పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. శుక్రవారం రాత్రి నూతలగుంటపాలెం, అచ్యుతాపురం, త్రిపురవానిపాలెం గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. వైఎస్ ఎంపీపీ నమ్మి మీనా, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు నమ్మి గణేష్, కలిగెట్ల నాయుడు, పప్పల మాలినాయుడు, మళ్ల గోపి, గొర్లి దేముడు, చందక రమణ, కొలి మాలి, రమణ, పప్పల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు



సీఐఎస్ఎఫ్ పోలీసులు నిర్వహిస్తున్న కవాతు


కవాతులో భారీగా పాల్గొన్న పోలీసులు

కశింకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సీఐఎస్ఎఫ్ పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కవాతు నిర్వహించారు. తేగాడ, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, వెదురుపర్తి, ఏనుగుతుని, నూతలగుంటపాలెం, ఏఎస్‌పేట, సోమవరం, నరసింగబిల్లి గ్రామాల్లో కవాతు జరిపారు. ఎస్ఐ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడి మృతి


కొత్త బ్రిడ్జి సమీపంలో యవకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనకాపల్లి: గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి ఓ యువకుడు(32) మృతిచెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శాంతారామ్ శనివారం చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి దువ్వాడ వెళ్లే రైలు మార్గంలో కొత్తగా నిర్మించిన ఆరులేన్ల రహదారి బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. అనకాపల్లి స్టేషన్ మేనేజర్ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. యువకుడి వివరాలు తెలియరాలేదని, సమాచారం తెలిసిన వారు 9491782534 నంబరును సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి చదువుకోవాలి


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మునగపాకలోని ప్రియదర్శిని ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి చదువుకోవాలన్నారు. పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ వేగి వీరునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, తేలు నూకరాజు, దాడి మునిలినాయుడు, పెంటకోట జగన్నాథరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి


సంతబయిల కాలువ వద్ద స్నానఘట్టాల పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

మునగపాక : భక్తులు పూజలు, స్నానమాచరించేందుకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నిధుల ద్వారా మునగపాకలో పరదేశమ్మగుడి దరి కాలువను ఆనుకొని మహిళలు స్నానమాచరించేందుకు వీలుగా మెట్లు,స్టీల్ రెయిలింగ్ తదితర అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో జిల్లా పరిషత్ నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, సచివాలయ మండల కన్వీనర్ పాలిమేర గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆడారి కాశీబాబు, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, కుంది సూర్యనారాయణ, శ్రీనివాసరావు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.